క్లుప్తంగా

ఆలయానికి రూ.లక్ష విరాళం



అడ్డాకుల: మండలంలోని కాటవరం శివాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి జెడ్పీటీసీ సభ్యుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి రూ.లక్ష విరాళం ప్రకటించారు. శుక్రవారం గ్రామస్తులకు చెక్కును అందజేశారు. రాజునాయక్, శ్రీనివాస్‌గౌడ్, కొండన్న, కృష్ణయ్య, జగన్నాథం గౌడ్, బాలరాజు తదితరులు ఉన్నారు.

గొర్రెల పంపిణీ వెంటనే చేపట్టాలి

రాజాపూర్: కురుమ యాదవుల నుంచి గొర్రెలు ఇస్తామని డీడీలు కట్టించుకుని కాలయాపన చేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కృష్ణయ్య పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కురుమ యాదవుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. వెంటనే గొర్రెలను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు.

ఓబీసీ విభాగాన్ని బలోపేతం చేయాలి



స్టేషన్ మహబూబ్‌నగర్: కాంగ్రెస్ పార్టీ ఓబీసీ విభాగాన్ని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని జిల్లా చైర్మన్ కె.రాజా బాల్‌చందర్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఓబీసీ విభాగం సమీక్షా సమావేశం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ విజయంలో ఓబీసీ విభాగం కీలకపాత్ర పోషించాలన్నారు. రాష్ట్ర ఓబీసీసెల్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌గా విజయ్‌కుమార్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఎంవీఎస్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా ఆయన బాధ్యతలు నిర్వర్తించారు. పీయూ వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్ ఆయనను ఈసందర్భంగా అభినందించారు.

విద్యుత్‌షాక్‌తో ఆవుమృతి

గండేడ్: విద్యుత్‌షాక్‌తో ఆవుమృతి చెందిన ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. జానంపల్లికి చెందిన పిట్ల చంద్రయ్య శుక్రవారం ఉదయం తన ఆవును మేపడానికి వదిలాడు. ఈ క్రమంలో అది పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లింది. ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుత్‌షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది. రూ. 80వేలకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధితుడు పేర్కొన్నారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

మిడ్జిల్: ఓ ప్రేమజంట పోలీసులకు ఆశ్రయించిన ఘటన మండలపరిధిలో చోటుచేసుకుంది. వెలుగొమ్ములకు చెందిన మాసయ్య, హైదారాబాద్‌కు చెందిన శ్రీలక్ష్మి కొనేళ్లుగా ప్రేమించుకున్నారు. గురువారం వివాహం చేసుకున్నారు. ఇద్దరి కులాలు వేరు కావడంతో కుటుంబాల నుంచి అభ్యంతరం వస్తుందని ముందు జాగ్రతగా శుక్రవారం పోలీసులను ఆశ్రయించారు. ఇద్దరూ మేజర్లు కావడంతో పాటుగా, ఇరు కుటుంబాల నుంచి అభ్యంతరం లేక పోవడంతో ఎస్‌ఐ శివనాగేశ్వర్ నాయుడు ఇరువురికి వెలుగొమ్ముల వెళ్లాలని సూచించారు.

విద్యార్థుల భవితకు వరం



దేవరకద్రలో విద్యార్థులతో కలిసి అల్పాహారం భుజిస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

దేవరకద్ర: సీఎం కేసీఆర్ నిర్ణయాలు విద్యార్థుల భవితకు వరమని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. చక్కని చదువు కోసం ఉదయాన్నే విద్యార్థుల కడుపు నింపాలన్న గొప్ప సంకల్పంతో సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని తీసుకువచ్చారని వివరించారు. శుక్రవారం దేవరకద్రలో ఉన్నత పాఠశాలలో పథకం ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి అల్పాహారం చేస్తూ మాట్లాడారు. విద్యావ్యవస్థలో సీఎం ఎన్నో గొప్ప మార్పుల చేశారని వివరించారు. ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ అన్నపూర్ణ, వైస్ ఎంపీపీ సుజాత, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంఈఓ జయశ్రీ, సర్పంచ్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కోయిల్‌సాగర్ రోడ్డు నుంచి బస్వాపూర్ వరకు బీటీరోడ్డు పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. వెంకటాయపల్లిలో డబుల్ బెడ్‌రూమ్‌ల నిర్మాణానికి, యాదవ కమ్యూనిటీ భవనానికి శంకుస్థాపన చేశారు. వెంకటాయపల్లి, బస్వాపూర్, గోప్లాపూర్ గ్రామాల్లో బతుకమ్మ చీరలను, వెంకటాయపల్లి, గద్దెగూడెం గ్రామాల్లో స్పోర్ట్స్ కిట్లను అందజేశారు.

చిన్నచింతకుంట: అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే బీఆర్‌ఎస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని గ్రామాల్లో బీటీ రోడ్డు, కమ్యూనిటీహాల్, చెక్‌డ్యాంలకు భూమిపూజ చేశారు. సీఎం రిలీఫ్ ఫండ్, గృహలక్ష్మి చెక్కులు, బతుకమ్మ చీరల పంపిణీ చేపట్టారు. ఎంపీపీ హర్షవర్ధన్‌రెడ్డి, జెట్పీటీసీ రాజేశ్వరి, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను విస్మరిస్తే తిరగబడతాం



పోస్టర్లతో నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ముదిరాజ్‌లను విస్మరిస్తే తిరుగుబాటు తప్పదని సంఘం నాయకులు హెచ్చరించారు. శుక్రవారం స్థానికంగా సమావేశం నిర్వహించారు. పండుగ సాయన్న సేవాసంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణముదిరాజ్ మాట్లాడారు. రాష్ట్రంలో 68 లక్షల ముదిరాజ్‌లు ఉన్నారన్నారు. అలాంటి తమకు ఒక్క సీటును కూడా బీఆర్‌ఎస్ కేటాయించకుండా అవమానించిందని అన్నారు. రాజ్యాధికారం కోసం పోరాటం చేస్తామన్నారు. ఈనెల 8న హైదరాబాద్‌లో భారీ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ బండప్రకాష్ హాజరు కానున్నట్లు వివరించారు. జిల్లా నుంచి పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సభపోస్టర్‌ను విడుదల చేశారు. మైత్రియాదయ్య, గోనెలశ్రీనివాస్, మెట్టుకాడి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మహ్మదుస్సేన్‌పల్లి బీఆర్‌ఎస్‌లో వర్గపోరు

అడ్డాకుల: మహ్మదుస్సేన్‌పల్లిలో బీఆర్‌ఎస్ వర్గపోరు శుక్రవారం మంత్రి నిరంజన్‌రెడ్డి పర్యటనలో బట్టబయలైంది. సర్పంచ్, ఉప సర్పంచ్ వర్గాలు చెరో దారి అన్నట్లుగా వ్యవహరించాయి. గ్రామంలో పలు అభివృద్ధి పనులకు మంత్రి పర్యటన ఖరారు కాగా పండుగ నర్సింహారెడ్డి కాంపౌండ్ నుంచి మొదలు పెట్టాలని నిర్ణయించారు. అయితే మంత్రి నిజాలాపూర్ మీదుగా రావడంతో సర్పంచ్ నిర్మల ఆధ్వర్యంలో గ్రామం ప్రారంభంలోనే బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన, ముదిరాజ్ కమ్యూనిటీ హాల్‌కు భూమిపూజ, బతుకమ్మ చీరలను పంపిణీ, కుట్టు మిషన్ల అందజేత చేపట్టారు. కాగా నర్సింహారెడ్డి వర్గం కబురు పంపినా రాలేదు. తర్వాత మంత్రి వెళ్తుండగా పండుగ నర్సింహారెడ్డి, ఉపసర్పంచ్ విజయకుమార్ తదితరులు మంత్రి వాహనం నిలిపి తమ వేదిక వద్దకు రావాలని పట్టుబట్టారు. దీంతో ఆయన అక్కడకు వెళ్లారు. ఈ నేపథ్యంలోనే ఇరువర్గాలకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. దసరా సమయంలో పల్లెనిద్రకు వచ్చి సర్దుబాటు చేస్తానని అన్నారు.

బతుకమ్మ చీరల పంపిణీ



కందూర్‌లో చీరలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి

భూత్పూర్: తాటిపర్తిలో శుక్రవారం బతుకమ్మ చీరలను సర్పంచ్ ఆకుల వెంకటయ్య, ముడా డైరెక్టర్ చంద్రశేఖర్‌గౌడ్ పంపిణీ చేశారు. అనంతరం ఉన్నత పాఠశాలకు నూతన హెచ్‌ఎంగా వచ్చిన సంగీతను సత్కరించారు. ఎంపీటీసీ పుల్లయ్య, కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.



తాటిపర్తిలో..

అడ్డాకుల: ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి అడ్డాకుల, కందూర్, వర్నె, ముత్యాలంపల్లి గ్రామాల్లో శుక్రవారం బతుకమ్మ చీరలను పంపిణీ చేసి మాట్లాడారు. తహసీల్దార్ ఘన్సీరాం, విండో అధ్యక్షుడు జితేందర్ రెడ్డి, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచులు పాల్గొన్నారు.



కుచ్చర్‌కల్‌లో..

రాజాపూర్: కుచ్చర్‌కల్‌లో శుక్రవారం సర్పంచ్ సుధారాణి చీరలను పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కోయిల్‌కొండ: మండల కేంద్రంలో సర్పంచ్ కృష్ణయ్య బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఎంపీటీసీ ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి రమేష్, నాయకులు పాల్గొన్నారు.

మెడికోలకు ఆటలపోటీలు

పాలమూరు: పాలమూరు మెడికల్ కళాశాలలో గత మూడు రోజులుగా ఇంతుజియా–23 వేడుకలు కొనసాగుతున్నాయి. శుక్రవారం విద్యార్థులకు కబ్బడీ, రంగోళీ, ఆర్ట్ పోటీలు, కుర్చీలాట, వాలీబాల్, ఫుడ్‌పోటీలు నిర్వహించారు. విద్యార్థులతో పాటు మహిళా ఆచార్యులు సైతం పాల్గొన్నారు. ఈనెల 8న వేడుకలు ముగియనున్నాయి.

సంక్షేమ పథకాలు బీఆర్‌ఎస్ వాళ్లకేనా?

బాలానగర్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలకు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలే అర్హులా అని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శంకర్ నాయక్ ప్రశ్నించారు. గురువారం మోతీఘణాపూర్‌లో ఇప్పటికీ గొర్రెలు అందించలేదని గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకువెళితే.. కాంగ్రెస్ నాయకులను మెడలు పట్టుకుని తోశారని ఆరోపించారు. ప్రశ్నిస్తే పోలీసులతో గెంటిస్తారా అని మండిపడ్డారు. దాడికి పాల్పడ్డ వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని నర్సింహ రెడ్డి, ప్రవీణ్ యాదవ్ డిమాండ్ చేశారు. బాలానగర్ నుంచి బోడ జానంపేట్‌కు అనుమతులు లేకుండా గ్యాస్ పైప్ లైన్ వేస్తున్నవారిపై చర్యలేవని ప్రశ్నించారు. న్యాయం చేయకపోతే ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. నాయకులు అరుణ్‌కుమార్ రెడ్డి, మల్లేష్‌యాదవ్, పెంట్యానాయక్, యాదయ్య, రఫీక్, శ్రీనివాస్ నాయక్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

రాచాల మాజీసర్పంచ్ మృతి

అడ్డాకుల: రాచాల మాజీసర్పంచ్ జీ.ఆనందం (72) అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని గాంధీ హాస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. కాగా ఆయన మృతదేహాన్ని శుక్రవారంరాత్రి రాచాలకు తీసుకొచ్చారు. ఆనందం 2001 నుంచి 2006 వరకు సర్పంచ్‌గా పనిచేశారు. ఆయన మృతిపట్ల సర్పంచ్ పాశం తిరుపతయ్య, వైస్ ఎంపీపీ రాధిక, మాజీ సర్పంచ్ సత్యమ్మ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

మండలాభివృద్ధికి సహకరించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ శశికళ

కోయిల్‌కొండ: ప్రజాప్రతినిధులు మండలాభివృద్ధికి సహకరించాలని ఎంపీపీ శశికళ, జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పలు గ్రామాల ప్రజాప్రతినిధులు సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. అధికారులు పరిష్కరించాలని వారు కోరారు. తహసీల్దార్ భరత్, ఎంపీడీఓ జయరాములు, వైస్‌ఎంపీపీ కృష్ణయ్యయాదవ్, సింగిల్ విండోచైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు నిరసన

భూత్పూర్: పట్టణంలోని చౌరస్తాలో శనివారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు మండల అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు లిక్కి నవీన్ కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రైతులకు 24 గంటల విద్యుత్తు సరఫరా చేయాలని కోరుతూ నిరసన తెలుపుతున్నట్లు వివరించారు. డీసీసీ అధ్యక్షుడు జి.మధుసుదన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారని వివరించారు.

ఇద్దరిపై కేసు నమోదు

అడ్డాకుల: వేములలో అనుమతి లేకుండా బెల్టు షాపు నిర్వహిస్తున్న దుకాణాలపై శుక్రవారం దాడులు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. వేములకు చెందిన సాయిలు, జంగం మురళీ అనే ఇద్దరి దుకాణాల్లో మద్యం పట్టుబడినట్లు వివరించారు. స్టేషన్‌ను తరలించి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

కుమారుడి అదృశ్యంపై ఫిర్యాదు

అడ్డాకుల: నాగాయపల్లికి చెందిన ఓ విద్యార్థి(16) కనిపించడం లేదని అతడి తండ్రి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపారు. సదరు విద్యార్థి కొత్తకోటలో ఇంటర్ చదువుతున్నట్లు వివరించారు. కాగా ఈనెల 4న రాత్రి నుంచి అతడు కనిపించకుండా పోయాడు. ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం ఫిర్యాదు చేశారని కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

అభివృద్ధిపై సవాల్‌కు సిద్ధమా?



తహసీల్దార్ కార్యాలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

నవాబుపేట: 'జడ్చర్ల నియోజకవర్గంలో ఏ మండలం తీసుకున్న సరే అభివృద్ధి విషయంలో చర్చకు సిద్ధం.. సవాల్‌కు సిద్ధమా?' అని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. కేవలం 9 ఏళ్లలో గతంలో ఎన్నడూ లేనంతగా నియోజకవర్గాన్ని తాము అభివృద్ధి చేశామన్నారు. శుక్రవారం మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇప్పటూర్‌లో రూ. ఆరు కోట్లు అభివృద్ధి పనులు, కూచూర్ దర్గారోడ్డు, జంగమయ్యపల్లి రోడ్డు, తీగలపల్లి రోడ్లను బీటీ మార్చే పనులు ప్రారంభించారు. నవాబుపేటలో మహిళా సమాఖ్య భవనం, అమ్మపూర్, రుక్కంపల్లి, లోకిరేవు, జంగమయ్యపల్లి, కాకర్లపహడ్ గ్రామాల్లో కమ్యూనిటీ భవనాలకు భూమిపూజ చేశారు. జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, ఎంపీపీ అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి శుక్రవారం జడ్చర్ల తహసీల్దార్, భూసార పరీక్ష కేంద్రం కార్యాలయాలు ప్రారంభించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రం ఏర్పడ్డాక సీఎం నేతృత్వంలో జిల్లాల విభజన, మండలాల ఏర్పాటు వంటి వాటితో అధికారుల పర్యవేక్షణ పెరిగిందన్నారు. తహసీల్దార్ శ్రీనివాసులును, భూసార పరీక్ష కేంద్రం ఏడీఏ అజయ్‌కుమార్‌ను అభినందించారు. అదనపు కలెక్టర్ మోహన్‌రావు, జెడ్పీ వైస్‌చైర్మన్ యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అనంతరం అంబేడ్కర్ కళాభవనం ప్రారంభించారు. ఎక్వాయపల్లిలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల పట్టాలు, పెద్ద ఆదిరాల, చిన్న ఆదిరాల, నేలబండతండా తదితర గ్రామాల్లో స్పోర్ట్స్ కిట్‌లను అందించారు. కొండేడ్‌లో రైతు వేదిక ప్రారంభ, బతుకమ్మ చీరల పంపిణీ, గొల్లపల్లిలో సీసీరోడ్లు, డ్రెయినేజీ, పట్టణకేంద్రంలో మేస్త్రీల సంఘ భవనాన్ని ప్రారంభించారు.

రోడ్డుపై బైఠాయించిన ఆశాలు, జేఏసీ నాయకులు



గండేడ్‌లో రాస్తారోకో చేస్తున్న ఆశావర్కర్లు, జేఏసీ నాయకులు

గండేడ్: సమస్యలు పరిష్కరించాలని ఆశావర్కర్లు, మండలాన్ని వికారాబాద్‌లో కలపాలని సాధన సమితి జేఏసీ సభ్యులు శుక్రవారం రాస్తారోకో చేశారు. మండలకేంద్రంలోని మహబూబ్‌నగర్–చించోళి రహదారిపై బైఠాయించారు. దాదాపు గంటసేపు నిరసన వ్యక్తం చేశారు. ఆశావర్కర్లు తమ డిమాండ్లు నెరవేర్చాలని కొన్నిరోజులుగా సమ్మె చేపట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మరో వైపు గండేడ్ మండలాన్ని వికారాబాద్‌లో కలిపాలని సాధన సమితి సభ్యులు వారు సైతం ఆందోళన చేపట్టారు. మహబూబ్‌నగర్ జిల్లా కారణంగా తాము అన్ని విధాలా నష్టపోతున్నామని వాపోయారు. ఈ నేపథ్యంలో ప్రయాణికులు 100 డయల్‌కు ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి వారిని సముదాయించారు. ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి అదే దారిలో వస్తుండడంతో ఆయన వచ్చే వరకు లేవమని వారు తెలపగా.. ఎస్‌ఐ సురేష్ అక్కడికి చేరుకొని మాట్లాడారు. ముందుగా ఎమ్మెల్యేకు దారి ఇవ్వాలని కోరడంతో వారు పక్కకు తప్పుకున్నారు. అనంతరం చీరల పంపిణీ సభాస్థలికి వెళ్లి ఎమ్మెల్యేకు వినతిపత్రాలు ఇచ్చారు. ఎమ్మెల్యే స్పందిస్తూ కేసీఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేయడం సరికాదన్నారు. ఆయన వల్లే తెలంగాణ వచ్చిందని, అభివృద్ధి జరుగుతోందని వివరించారు.

ఇంటింటికీ ప్రభుత్వ పథకాలు : ఎమ్మెల్యే



బల్సుర్‌గొండలో చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

గండేడ్: మహిళలకు బతుకమ్మ చీరల పంపిణీ గర్వకారణమని పరిగి ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో చీరలు, క్రీడాసామగ్రి కిట్లు పంపిణీ చేసి మాట్లాడారు. పగిడ్యాల్‌లో పంచాయతీ భవనం, పంచాంగల్ తండాలో క్రీడా ప్రాంగణం ప్రారంభించారు. కేసీఆర్ ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి పథకాలను అమలు చేస్తోందన్నారు. ఎంపీపీ మాధవి, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఈశ్వరయ్య, ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి, స్పెషల్ ఆఫీసర్ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్: ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని, అందువల్ల కేసీఆర్ ప్రభుత్వానికి అండగా నిలవాలని ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో బతుకమ్మ చీరలు, స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ చేశారు. మండల కేంద్రానికి ఇటీవల మంజూరైన ఇంటర్ కళాశాలను ప్రారంభించారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి ఏర్పాటు చేసిన ఆరోగ్యరథం ద్వారా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం



విద్యార్థులతో కలిసి అల్పాహారం తింటున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు, ఆరోగ్యకరమైన ఆహారం విద్యార్థులకు అందించడమే లక్ష్యమని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. అందులో భాగంగా సీఎం అల్పాహార పథకం ప్రారంభించినట్లు వివరించారు. జిల్లాకేంద్రంలోని మోడల్ బేసిక్ పాఠశాలలో పథకాన్ని ప్రారంభించారు. పాఠశాలకు వచ్చిన ఏ విద్యార్థి ఆకలితో ఉండకుండా చూడడమే ధ్యేయమన్నారు. పాఠశాలలో రూ.50 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టామని, వసతులు కల్పించామన్నారు. ఎస్పీ నరసింహ, ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ యాదయ్య, డీఈఓ రవీందర్, మున్సిపల్ చైర్మన్ నర్సిములు, ముడా చైర్మన్ వెంకన్న పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ రూరల్: పల్లెల సమగ్రాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మాచన్‌పల్లిలో సీసీరోడ్డు, మహిళా సమాఖ్య భవనం నిర్మాణానికి, వెంకటాపూర్‌లో నూతన రోడ్డు, బ్రిడ్జి, కమ్యూనిటీహాల్ పనులకు భూమిపూజ చేశారు. సీసీరోడ్డును ప్రారంభించారు. వెంకటాపూర్ మాజీ సర్పంచ్ వెంకటయ్య మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బి.రాజేశ్వర్‌గౌడ్, ఎంపీపీ సుధాశ్రీ, జెడ్పీటీసీ సభ్యురాలు పి.వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపీపీ అనిత, సర్పంచ్ పాల్గొన్నారు.

నవాబుపేట: తెలంగాణ ఏర్పాటు కావటంతోనే ఇక్కడి పర్యాటక ప్రాంతాలకు ప్రత్యేక గుర్తింపు వచ్చిందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం పర్వతాపూర్ మైసమ్మ ఆలయంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ చేశారు. జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, ఎంపీపీ అనంతయ్య పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలో వరుసగా ఆరోరోజు శుక్రవారం అభివృద్ధి పనులకు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో కళాభారతి భవనాన్ని, కోయిల్‌కొండ ఎక్స్‌రోడ్డు సమీపంలో స్లాటర్‌హౌస్‌ను కలెక్టర్ జి.రవినాయక్‌తో కలిసి ప్రారంభించారు. పాతపాలమూరు సమీపంలో బ్రిడ్జికి, పాలకొండలో సీసీరోడ్డు, బైపాస్ రోడ్డు ఫుట్‌పాత్ పనులకు భూమిపూజ చేశారు. జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు గోపాల్‌యాదవ్, ముడా చైర్మన్ గంజి వెంకన్న, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, వైస్‌చైర్మన్ తాటి గణేష్‌కుమార్, కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.